క్లుప్తంగా

కానిస్టేబుల్‌కు అభినందనలు



కామారెడ్డి క్రైం: ఇటీవల జరిగిన ప్రపంచ పోలీసు, ఫైర్ గేమ్స్‌లో కామారెడ్డి జిల్లాకు చెందిన కానిస్టేబుల్ మహమ్మద్ బాబా చక్కని ప్రతిభ కనబరిచి రెండు కాంస్య పతకాలు సాధించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయానికి విచ్చేసిన ఆయనను ఎస్పీ రాజేష్ చంద్ర అభినందించారు. గత నెల 27 నుంచి ఈ నెల 6 వరకు ఇంగ్లాండ్‌లోని బర్మింగ్‌హామ్‌లో జరిగిన ప్రపంచ స్థాయి పోలీసు క్రీడల్లో బాబా పాల్గొని పరుగు పందెం, షాట్‌పుట్ క్రీడల్లో కాంస్య పతకాలు సాధించడం గొప్ప విషయమన్నారు. ప్రతిభావంతులకు ఎల్లవేళలా సహకారం అందిస్తామన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బిచ్కుంద(జుక్కల్): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తహసీల్దార్ వేణుగోపాల్ గౌడ్ తెలిపారు. ఇంటిని పోషించే వ్యక్తి మృతి చెందితే ఈ పథకం కింద కుటుంబానికి రూ. 20 వేలు ఆర్థిక సహాయం అందుతుందన్నారు. మృతుడి వయస్సు 18 నుంచి 59 ఏళ్ల లోపు ఉండాలన్నారు. పూర్తి వివరాలకు తహసీల్ కార్యాలయంలో సంప్రదించవచ్చని సూచించారు.

పిచ్చి మొక్కల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



బీబీపేట: మండల కేంద్రంలోని ప్రధాన రహదారి నుంచి ముదిరాజ్ వార్డులోకి వెళ్లే దారిలో విద్యుత్ స్తంభానికి పిచ్చి మొక్కలు అల్లుకోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని బుధవారం ప్రచురితమైన నేటి చిత్రం వార్త 'నిలువెత్తు నిర్లక్ష్యం' అనే శీర్షికకు విద్యుత్ అధికారులు స్పందించారు. గురువారం ఉదయం క్షేత్రస్థాయిలోకి వెళ్లి పిచ్చి మొక్కలను తొలగించారు. విద్యుత్‌కు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని ఏఈ విజయభాస్కర్ తెలిపారు.

'ప్రతిభ'కు సన్మానం



పిట్లం(జుక్కల్): కోల్‌కతాలో ఇటీవల జరిగిన ఇండియన్ ఓపెన్ ఇంటర్నేషనల్ చెస్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్, ఏషియన్ చెస్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలలో పిట్లంకు చెందిన ప్రతిభ 6 బంగారు పతకాలు సాధించారు. అదేవిధంగా సెర్బియాలోని ప్రపంచ చెస్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌నకు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని మీడియా ద్వారా తెలుసుకున్న జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ బుధవారం ప్రతిభను హైదరాబాద్‌లోని తన కార్యాలయానికి ఆహ్వానించి ఘనంగా సన్మానించారు.

కలెక్టర్‌తో భేటీ



కామారెడ్డి టౌన్: కామారెడ్డి మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ బి.వాల్య బుధవారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మొక్కను అందజేశారు. సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో ప్రొఫెసర్ ఆర్థోపెడిక్‌గా పనిచేసిన ఆయన ఇటీవల పదోన్నతిపై కామారెడ్డి జిల్లా మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్‌గా బాధ్యతలు చేపట్టారు.

ఎస్సీ గురుకుల పాఠశాల పరిశీలన



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలను ఆర్డీవో పార్థసింహారెడ్డి బుధవారం పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. ప్రిన్సిపల్ నాగేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

విద్యార్థుల చదువులపై శ్రద్ధ చూపాలి

నిజాంసాగర్(జుక్కల్): విద్యార్థుల చదువులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని మహమ్మద్ నగర్ ఎంఈవో అమర్‌సింగ్ అన్నారు. బుధవారం నర్వ గ్రామ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. రిజిష్టర్లను పరిశీలించారు.

పులి జాడ కోసం వెతుకులాట

- మరిన్ని ట్రాక్ కెమెరాల ఏర్పాటు
- ఆ ప్రాంతంలోనే ఉన్నట్టు అంచనా
- గాలింపులో మూడు బృందాలు



పులి కోసం అడవిలో గాలింపు చేపడుతున్న అటవీ శాఖ సిబ్బంది

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : పులి జాడ కోసం వెదుకులాట కొనసాగుతోంది. అదే ప్రాంతంలో పులి తిరిగినట్టు మరిన్ని ఆధారాలు లభించడంతో అటవీ శాఖాధికారులు ట్రాక్ కెమెరాలను మరిన్ని ఏర్పాటు చేశారు. దాదాపు 25 ట్రాక్ కెమెరాలు ఏర్పాటు చేసినట్టు అటవీ శాఖ వర్గాల ద్వారా తెలుస్తోంది. రామారెడ్డి, మాచారెడ్డి, సిరికొండ మండలాల సరిహద్దు అటవీ ప్రాంతంలో పులి తిరిగిన విషయంపై క్లారిటీతో ఉన్న అధికారులు పులి పాద ముద్రలను మరిన్ని గుర్తించారు. కచ్చితంగా అదే ప్రాంతంలో ఉన్నట్టు అంచనాకు వచ్చారు. గుట్టలు, లోయలతో కూడిన ప్రాంతం కావడం, అడవి కూడా పచ్చబడి, పొదలు పెరగడంతో పులి కదలికలు కెమెరాలకు చిక్కడం లేదు. అయితే ట్రాక్ కెమెరాలు ఎక్కువ సంఖ్యలో బిగించడంతో ఒకటి రెండు రోజుల్లో పులి కదలికలు దొరికే అవకాశం ఉందని అంటున్నారు. నాలుగైదు రోజులుగా అటవీ శాఖ అధికారులు పులి ఆచూకీ కోసం రాత్రింబవళ్లు తిరుగుతున్నా ఇప్పటికీ దాని జాడ దొరకలేదు. అయితే ఆ ప్రాంతంలోనే ఉండి ఉంటుందన్న నిర్ణయానికి వచ్చి రెస్క్యూ ఆపరేషన్ ముమ్మరం చేశారు. మూడు బృందాలుగా విడిపోయిన అధికారులు, సిబ్బంది పులి జాడను కనిపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు.

కునుకు కరువాయె..

పులి సంచారంతో అటవీ అధికారులకు కునుకు కరువైంది. నాలుగైదు రోజులుగా పులి జాడ కోసం రెస్క్యూ ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. అధికారులు కూడా రాత్రింబవళ్లు రెస్క్యూ సిబ్బందితో పర్యవేక్షిస్తున్నారు. అయితే అడవిలో కొన్ని ప్రాంతాల్లో సెల్ సిగ్నల్స్ అందడం లేదని తెలుస్తోంది. సమాచారం ఇవ్వడం కోసం కొందరు బయటకు వచ్చి ఫోన్లు మాట్లాడి వెళుతున్నారు. పులి ఆచూకీ దొరికే దాక రెస్క్యూ ఆపరేషన్ కొనసాగే పరిస్థితి ఉంది. ఇప్పటికే సరైన నిద్ర లేక, అడవిలో కిలోమీటర్ల కొద్దీ తిరగడంతో చాలా మంది నీరసించిపోతున్నారు.

భయపడుతున్న రైతులు, పశువుల కాపర్లు..

అటవీ ప్రాంతంలో పులి సంచారంపై ఫారెస్టు అధికారులు ఊళ్లల్లో డప్పు వేయించారు. అడవిలోకి ఎవరూ వెళ్లొద్దని చెప్పడంతో పశువులు, గొర్రెలు, మేకలను మేపడానికి వెళ్లాలన్నా, అడవిని ఆనుకున్న ఉన్న పంట చేల వద్దకు వెళ్లాలన్నా రైతులు భయపడుతున్నారు. పులి ఆచూకీ దొరికి అటవీ శాఖ అధికారులకు చిక్కేదాకా ఇబ్బందులు తప్పేట్టు లేదని అంటున్నారు.

బ్యాంకుల వద్ద భద్రతను పటిష్టం చేయాలి

- ఏఎస్పీ చైతన్యారెడ్డి



భిక్కనూరు పోలీస్ స్టేషన్‌లో బ్యాంక్ మేనేజర్లతో మాట్లాడుతున్న ఏఎస్పీ చైతన్యారెడ్డి

భిక్కనూరు: బ్యాంకులు, ఏటీఎంల వద్ద భద్రతను మరింత పటిష్టం చేయాలని కామారెడ్డి ఏఎస్పీ చైతన్యారెడ్డి సూచించారు. బుధవారం భిక్కనూరు పోలీస్ స్టేషన్‌లో సర్కిల్ పరిధిలోని రాజంపేట, బీబీపేట, దోమకొండ, భిక్కనూరు మండలాల్లోని అన్ని బ్యాంకుల మేనేజర్లతో ఆమె సమావేశం నిర్వహించి మాట్లాడారు. బ్యాంకులోని సీసీ కెమెరాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని అన్నారు. అలాగే ఏటీఎంల వద్ద కూడా సీసీ కెమెరాలను మరింత పటిష్ట పరచాలన్నారు. పలు సూచనలు, సలహాలిచ్చారు. సీఐ సంపత్‌కుమార్, ఎస్సైలు అంజనేయులు ప్రవంతి, ప్రభాకర్, అన్ని బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

సైబర్ నేరాలతో జాగ్రత్త

భిక్కనూరు: ప్రస్తుతం ప్రజలను డ్రగ్స్, సైబర్ నేరాలు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని వాటితో అందరూ జాగ్రత్తగా ఉండాలని కామారెడ్డి ఏఎస్పీ చైతన్యారెడ్డి అన్నారు. బుధవారం అంతంపల్లిలో గ్రామస్తులు ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలను, ముదిరాజు సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ దేవాలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీసీ కెమెరాలు కనిపించని పోలీసులని అన్నారు. యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటోందని.. తల్లిదండ్రులు తమ పిల్లలను గమనించాలన్నారు. సీఐ సంపత్ కుమార్, ఎస్సై అంజనేయులు, మాజీ ఎంపీపీ కిషన్‌రావు, నేతలు వెంకట్‌రెడ్డి, గంగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మధు, తదితరులు పాల్గొన్నారు.

సహాయ ఉపకరణాల కోసం దివ్యాంగుల ఎంపిక



కామారెడ్డి అర్బన్: దివ్యాంగులకు సహాయ ఉపకరణాలు అందజేయడానికి మంగళవారం కలెక్టరేట్‌లో ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. అదనపు కలెక్టర్ విక్టర్, జిల్లా సంక్షేమ అధికారి ప్రమీల, ఆర్‌టీవో శ్రీనివాస్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఎంపిక కార్యక్రమంలో పాల్గొన్నారు. దివ్యాంగులకు స్కూటీ, త్రిచక్ర బ్యాటరీ సైకిల్, బ్యాటరీ ఆటో, లాప్‌టాప్, స్మార్ట్‌ఫోన్లు పొందడానికి పలువరు దివ్యాంగులు దరఖాస్తు చేసుకోగా వారు పేర్కొన్న ప్రకారం ధ్రువపత్రాలు, అంగవైకల్యం తదితర అంశాలను అధికారులు పరిశీలించారు.

ఎల్‌హెచ్‌పీఎస్ నూతన కార్యవర్గం ఎన్నిక



రాజంపేట: మండల లంబాడ హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) నూతన కార్యవర్గాన్ని బుధవారం రాజంపేటలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు సునావత్ గణేష్ నాయక్ తెలిపారు. అధ్యక్షుడిగా బానోత్ షేర్‌సింగ్, ఉపాధ్యక్షుడిగా పీర్‌సింగ్, ప్రధాన కార్యదర్శిగా ఇస్లావత్ శీను, గౌరవ అధ్యక్షుడిగా సభావాత్ పీర్య, కోశాధికారిగా చవాన్ రవిలు ఎన్నికయ్యారు. కామారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్రి నాయక్, రూప్ సింగ్ నాయక్, శంకర్ నాయక్, బానోత్ మదన్‌లాల్ నాయక్, నొసీలాల్ నాయక్, రమావత్ దేవిసింగ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు కంప్యూటర్‌లో మెలకువలు నేర్పాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు కంప్యూటర్ విద్యలో మెలకువలు నేర్పాలని శెట్పల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు వసుధ సూచించారు. బుధవారం ఆమె శెట్పల్లిసంగారెడ్డి ప్రాథమిక పాఠశాలలో ఏఎక్సెల్-ఏఐ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రాథమిక పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఏఎక్సెల్-ఏఐ వల్ల విద్యార్థులకు పాఠశాలపై ఇష్టం పెరుగుతుందన్నారు. హెచ్ఎం ఫణి కుమార్, అఖిల్, శేషయ్య, మమత, సౌమ్య, రాజు తదితరులున్నారు.

మున్సిపల్ కుళాయిల ద్వారా కలుషిత నీటి సరఫరా

- బల్దియా అధికారుల తీరుపై పుర ప్రజల ఆగ్రహం



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కుళాయిల ద్వారా శుద్ధి చేయని నీరు సరఫరా అయ్యాయి. బుధవారం పాత పట్టణంలో సరఫరా అయిన నీరు శుద్ధి కాకుండా సరఫరా కావడంతో ప్రజలు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. నీరు మురుగు వాసన వచ్చిందని, చిన్న చిన్న పురుగులు కూడా వచ్చాయని తెలిపారు. ఫిల్టర్ బెడ్‌ల వద్ద శుద్ధి చేయకుండానే ప్రజలకు నీటిని సరఫరా చేస్తున్నారని, వ్యాధులు వచ్చే అవకాశం ఉందని పలువురు మాజీ కౌన్సిలర్లు మున్సిపల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై మున్సిపల్ డీఈ వేణుగోపాల్‌ను వివరణ కోరగా.. పరిశీలన చేసి చర్యలు తీసుకుంటానని చెప్పారు.

కలెక్టరేట్‌లో దివ్యాంగుల నిరసన

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో బుధవారం దివ్యాంగుల పరికరాల పంపిణీ కోసం సర్టిఫికేట్ల వెరిఫికేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగులకు సౌకర్యాలు ఏర్పాట్లు చేయకపోవడంతో నిరసన తెలిపారు. తాగడానికి నీరు, వీల్‌చైర్, దివ్యాంగులను తీసుకెళ్లడానికి సహాయకులు లేక ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇబ్బందులు ఎదుర్కొన్నామని వారు వాపోయారు. దివ్యాంగ హక్కుల సమితి ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు.

డీఈఈటీ పోస్టర్ల ఆవిష్కరణ



కామారెడ్డి క్రైం: ఉద్యోగాలు పొందాలని భావించే వారి కోసం ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ ఆఫ్ తెలంగాణ(డీఈఈటీ) వాల్ పోస్టర్‌లను బుధవారం కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆవిష్కరించారు. డీఈఈటీ అప్లికేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాల కోసం కలెక్టరేట్‌లోని జిల్లా పరిశ్రమల కేంద్రంలో సంప్రదించాలని కేంద్రం జిల్లా అధికారి లాలూ నాయక్ తెలిపారు.

మాలల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి

బాన్సువాడ రూరల్: ఈ నెల 27న పట్టణంలోని మీనాగార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించనున్న మాలల ఆత్మీయ సమ్మేళనానికి హాజరై విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం తెలంగాణ మాలసంఘం ప్రతినిధులు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, స్టేట్ ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజులను ఆహ్వానించారు. తెలంగాణ రాష్ట్ర మంత్రి వర్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి సమావేశానికి వస్తున్నారని తెలియజేశారు.తెలంగాణ మాలసంఘం వ్యవస్థాపకులు అయ్యాల సంతోష్, నాయకులు దొన్కంటి ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కులపై అవగాహన పెంచుకోవాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): విద్యార్థి దశ నుంచే మానవ హక్కులపై కనీస అవగాహన పెంపొందించుకోవాలని మానవ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎంఏ. సలీం అన్నారు. బుధవారం అడ్లూర్ ఎల్లారెడ్డిలో సంఘం జిల్లా అధ్యక్షుడు ముసల శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. ఎక్కడైతే మానవుల హక్కులు ఉల్లంఘించబడతాయో అక్కడ అభివృద్ధి కుంటుపడుతుందని పేర్కొన్నారు. హెచ్ఎం నవీన జ్యోతి, సంఘం రాష్ట్ర సలహాదారులు రమణారెడ్డి, జోనల్ అధ్యక్షుడు ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీటి లీకేజీ

- నీరు నిలిచి బురదమయంగా మారిన రహదారి



నిరసన తెలుపుతున్న చిన్నకొడప్‌గల్ గ్రామస్తులు

పిట్లం(జుక్కల్): చిన్నకొడప్‌గల్‌లో కొన్ని రోజులుగా మిషన్ భగీరథ నీళ్ల రోడ్డు పక్కన లీకేజీ అయి రోడ్డు మీదకి రావడంతో బురదమయంగా మారి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని ఆరోపిస్తూ గ్రామస్తులు బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చాలా సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డుపై నీరు నిల్వ ఉండటంతో దుర్వాసన వస్తోందని, అదే విధంగా దోమల బెడద ఎక్కువ అవుతోందన్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): వర్షాకాలంలో ప్రబలే వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో నరేష్ సూచించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికెన్‌గున్యా తదితర వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. దోమల నివారణకు ఆయిల్ బాల్స్, దోమల మందు వాడాలని, బ్లీచింగ్ పౌడర్‌ను వీధుల్లో వేయించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, వన మహోత్సవం గురించి చర్చించారు. ఎంపీవో మలహరి, ఏపీవో నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

కల్తీకల్లు విక్రయిస్తే కఠిన చర్యలు



పిట్లం(జుక్కల్): మండలంలోని కల్లు దుకాణాలలో ఎక్సైజ్ అధికారులు బుధవారం విస్తృతంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా బిచ్కుంద ఎక్సైజ్ సీఐ డి.సత్యనారాయణ మాట్లాడుతూ..బొల్లకపల్లి, మద్దెల చెరువు, గౌరారం, రాంపూర్ గ్రామాలలో కల్లు దుకాణాలు లైసెన్స్‌లో చూపిన ప్రదేశంలో కాకుండా, వేరే ప్రదేశంలో విక్రయాలు జరుపుతున్నారని.. అందుకనే వీరిపై కేసులు నమోదు చేశామన్నారు. అలాగే కల్తీకల్లు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బిచ్కుంద సర్కిల్ పరిధిలోని మద్నూర్, బిచ్కుంద, డోంగ్లి, జుక్కల్, పెద్దకొడపగల్, పిట్లం మండలాలలో తనిఖీలు చేసినట్లు తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలి



లింగంపేట ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు



మాచారెడ్డి ఎంపీడీవోకు వినతిపత్రం..

లింగంపేట(ఎల్లారెడ్డి): ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలని బుధవారం ఎంపీడీవో నరేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 20 ఏళ్లుగా ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాలుగు నెలలుగా వేతనాలు సైతం ఇవ్వడంలేదని.. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక 50 మంది వరకు ఫీల్డ్ అసిస్టెంట్లు గుండెపోటుతో మృతి చెందినట్లు ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు హామీలు నెరవేర్చేవరకు వివిధ రూపాల్లో నిరసనలు తెలుపుతామని వెల్లడించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు శివరాంనాయక్, మండల అధ్యక్షుడు పవన్, కార్యదర్శి కాళిదాస్, తదితరులు పాల్గొన్నారు.

సమావేశం బహిష్కరణ

మాచారెడ్డి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వారం వారం నిర్వహించే ఉపాధి హామీ సమావేశాన్ని ఫీల్డ్ అసిస్టెంట్లు బహిష్కరించారు. బుధవారం జరిగిన సమావేశాన్ని వారు బహిష్కరించి తమకు నాలుగు నెలలుగా వేతనాలు రావడం లేదని నిరసన తెలిపారు. అనంతరం ఎంపీడీవో గోపిబాబుకు వినతిపత్రం అందజేశారు. ఏపీవో సాయిబాబా, టెక్నికల్ అసిస్టెంట్లు బంకట్‌లాల్, సంతోష్, శ్రీకాంత్, ఫీల్డ్ అసిస్టెంట్లు దేవేందర్, రాజేశ్, జగన్, బాల్‌రాజు, తదితరులున్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం



గాయత్రిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే పోచారం

బాన్సువాడ రూరల్: కొత్తాబాదిలో గల తెలంగాణ మాడల్‌స్కూల్‌లో చదువుకుని పదో తరగతిలో 600మార్కులకు గానూ 576మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచిన బసిరెడ్డి గాయత్రి(బోర్లం)ని బుధవారం ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి సన్మానించారు. ఉత్తమ మార్కులు సాధించడమే కాకుండా బాసర ట్రిపుల్ ఐటీలో సీటు పొందటం గర్వకారణమని పోచారం అన్నారు. గాయత్రి ప్రతిభ గుర్తించిన మిడ్‌మే మిల్స్ నిర్వాహకులు విజయమ్మ.. రూ.10వేల ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ప్రిన్సిపల్ కమల్ కిషోర్, నాయకులు ఎజాస్, నర్సింహులు, రవీందర్‌రెడ్డి, ప్రశాంత్ పాల్గొన్నారు.

బహుజన అలయ్.. బలయ్‌కు హాజరుకండి

బాన్సువాడ రూరల్: ఈ నెల 27న కామారెడ్డిలోని కళాభారతిలో నిర్వహించనున్న బహుజన అలయ్.. బలయ్ రాజ్యాంగ పరిరక్షణ సదస్సుకు హాజరై విజయవంతం చేయాలని కోరుతూ అంబేద్కర్ యువజన సంఘం నాయకులు బుధవారం ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డిని కోరారు. ఎమ్మెల్యే నివాసంలో ఆయను మర్యాదపూర్వకంగా కలుసుకని భారత రాజ్యాంగాన్ని అందించి ఘనంగా సన్మానించారు. నేతలు బి. రాజ్‌కుమార్, బాలరాజు, బంగారు మైసయ్య, తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మం, సంస్కృతిని కాపాడాలి



మద్దికుంటలో వీహెచ్‌పీ కమిటీ సభ్యులు

రామారెడ్డి: సనాతన ధర్మం, సంస్కృతిని కాపాడాలని, ప్రతి హిందువులో చైతన్యం తీసుకురావడానికి విశ్వహిందూ పరిషత్(వీహెచ్‌పీ), బజరంగ్‌దళ్ శాఖలను గ్రామగ్రామాన ఏర్పాటు చేస్తున్నామని వీహెచ్‌పీ జిల్లా కోశాధికారి డిష్ శ్రీనివాస్ అన్నారు. మద్దికుంటలో బుధవారం వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ కమిటీలను ఏర్పాటు చేశారు. మద్దికుంట వీహెచ్‌పీ అధ్యక్షుడిగా గుండెబోయిన భానుచందర్, ఉపాధ్యక్షులుగా రేకులపల్లి ప్రసాద్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గద్దెల శేఖర్, కోశాధికారిగా చిల్లపురం రాజు, తదితరులను నియమించారు. జిల్లా కోశాధికారి అమ్ముల శ్రీనివాస్, జిల్లా సత్సంగ ప్రముక్ బోల్గని శ్రీనివాస్, బజరంగ్ దళ్ జిల్లా సహసంయోజక్ కడెం సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

బహిరంగప్రాంతాల్లో మద్యం సేవిస్తే చర్యలు తప్పవు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని నాగిరెడ్డిపేట ఎస్సై భార్గవ్‌గౌడ తెలిపారు. మండలంలోని బొల్లారం, కన్నారెడ్డి గ్రామాల శివారుల్లో బహిరంగప్రాంతాల్లో మద్యం సేవిస్తున్న పలువురిని పట్టుకొని చట్టపరమైన చర్యలు తీసుకున్నామని ఆయన చెప్పారు.

ప్రతి విద్యార్థి తల్లిదండ్రులను గౌరవించాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): పాఠశాలలోని ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల మాట వినడంతోపాటు వారిని గౌరవించాలని నాగిరెడ్డిపేట ఎస్సై భార్గవ్‌గౌడ్ సూచించారు. గోపాల్‌పేట హైస్కూల్‌లో బుధవారం ఉపాధ్యాయులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. దీంతోపాటు పాఠశాలలోని విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. సోషల్ మీడియాతో జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. సమావేశంలో హైస్కూల్ హెచ్ఎం వెంకట్రాంరెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ మనోహర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పనులు వేగవంతం అయ్యేలా చూడాలి

ఎల్లారెడ్డి: ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ మహేష్‌కుమార్ అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో వార్డు ఆఫీసర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై అరుణ్ కుమార్ హెచ్చరించారు. బుధవారం హజ్గుల్ క్వారీ నుంచి మండలంలోని పోచారం చౌరస్తా 161 జాతీయ రహదారిపై అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.అనంతరం ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేశారు.

రికార్డులను సక్రమంగా నిర్వహించాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గ్రామపంచాయతీ రికార్డులను ఎప్పటికప్పుడు రాస్తూ సక్రమంగా నిర్వహించాలని నాగిరెడ్డిపేట ఎంపీడీవో ప్రభాకరచారి సూచించారు. బంజరతండా జీపీ కార్యాలయాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. పంచాయతీ కార్యదర్శి మమత ఉన్నారు.

గౌరవ వేతనం చెల్లించాలి

భిక్కనూరు: ఎన్నికల విధులు నిర్వహిస్తున్న తమకు గౌరవ వేతనం ఇవ్వాలంటూ బూత్ స్థాయి అధికారులు భిక్కనూరు తహసీల్దార్ సునీతకు బుధవారం వినతి పత్రం అందజేశారు. గడిచిన మూడేళ్లుగా ఎన్నికల విధుల్లో పాల్గొంటూ పనులు చేస్తున్నా తమకు ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గౌరవ వేతనం గురించి అధికారులు ఎవ్వరూ పట్టించుకోవడం లేదన్నారు.

అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని వినతి

భిక్కనూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న కెమిస్ట్రీ, జువాలజీ అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని టీజీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి రాధాబాయికి బుధవారం వినతి పత్రం అందజేశారు. తరగతులు ప్రారంభమై నెల రోజులు దాటిందని, ఈ రెండు సబ్జెక్టులకు అధ్యాపకులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని వారు వాపోయారు. టీజీవీపీ మండలాధ్యక్షుడు భరత్, ఉపాధ్యక్షుడు కార్తీక్, కళాశాల అధ్యక్షుడు విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.